క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

కోదాడరూరల్ : పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలను శుక్రవారం పట్టణంలోని రాంరెడ్డిపాలెం రోడ్‌లో గల ఎక్సైజ్ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీజ్ చేసిన నాలుగు ద్విచక్రవాహనాలకు వేలం వేస్తున్నామని ఆసక్తి గల వారు ఉదయం 9గంటల వరకు కార్యాలయంలో ధరావత్ చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

నూతన భవన నిర్మాణాలకు నిధులు మంజూరు

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లోని పలు గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ నూతన భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి కృషితో రూ.11కోట్లతో 28గ్రామపంచాయతీ కార్యాలయ భవనాలు, 45 అంగన్‌వాడీ కేంద్ర భవనాలు మంజూరయ్యాయి. ఈ మేరకు కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ఉపాధిహామీ నిధులతో ఆయా పనులు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 11గ్రామపంచాయతీ కార్యాలయ భవనాలు, 11అంగన్‌వాడీ కేంద్ర భవనాలు, కోదాడ నియోజకవర్గంలో 17గ్రామపంచాయతీ భవనాలు, 34 అంగన్‌వాడీ కేంద్ర భవనాలు మంజూరయ్యాయి. ఒక్కో గ్రామపంచాయతీ కార్యాలయ భవనం నిర్మాణానికి రూ.20లక్షలు, అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రూ.12లక్షలు చొప్పున కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కళోత్సవాలను జయప్రదం చేయాలి

హుజూర్‌నగర్ : తెలంగాణ జానపద జాతర సంబరాలలో భాగంగా పట్టణంలో మూడు రోజుల పాటు నిర్వహించే కళోత్సవాలను జయప్రదం చేయాలని నిర్వహణ కమిటీ అధ్యక్షుడు దొంతగాని సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ ఉత్సవాలు నేటి నుంచి (శుక్రవారం) నుంచి 25వతేదీ వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

పలకలు, పెన్సిళ్లు, పుస్తకాలు అందజేత


విద్యార్థులకు పలకలు, పుస్తకాలు అందజేస్తున్న చిరంజీవి యూత్ సభ్యులు

గరిడేపల్లి : మండలంలోని అబ్బిరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలలో గురువారం సినీ నటుడు చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా చిరంజీవి యూత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలకలు, పుస్తకాలు, పెన్సిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం యూత్ సభ్యులు సహకరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తోడేటి వెంకటేశ్వర్లు, చిలక కాశయ్య, యాకూబ్, హుస్సేన్, దావాజీ విజయ్, వీరస్వామి, పాఠశాల హెచ్‌ఎంలు సైదిరెడ్డి, శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

హుజూర్‌నగర్ : మున్నూరుకాపు కార్పొరేషన్‌కు ప్రభుత్వం రూ.2వేల కోట్ల నిధులు కేటాయించాలని ఆ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె.నాగేశ్వరరావు కోరారు. గురువారం పట్టణంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి మూడు నెలలైనా చైర్మన్‌ను నియమించకపోవడం అన్యాయమని, ప్రభుత్వం వెంటనే చైర్మన్ నియమించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె.వెంకటేశ్వర్లు, ఎస్.నాగసైదయ్య, టి.భిక్షం, బి.మహేష్, కె.నాగేశ్వరరావు, వీరస్వామి, వెంకటయ్య, శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ చేయూత


నిత్యావసర సరుకులు అందజేస్తున్న క్లబ్ అధ్యక్షుడు రామస్వామి

నేరేడుచర్ల : మండలంలోని జానలదిన్నె గ్రామానికి చెందిన నిరుపేద నేరేళ్ల ప్రమీలకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి గుండ్రెడ్డి సైదిరెడ్డి, క్లబ్ కోశాధికారి ఎస్‌కె యూసుఫ్, చిత్రం విశ్వనాథం, గ్రామస్తులు నాగార్జున, పవన్, శ్రీను తదితరులున్నారు.

గుండెపోటుతో మహిళ మృతి

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన గునుగుంట్ల పుష్పావతి (60) శుక్రవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందింది. ఆమె మృతి పట్ల విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు ఎండీ.ఖలీల్ అహ్మద్, అసోసియేట్ అధ్యక్షుడు అలుగుబెల్లి అప్పారెడ్డి, ఉపాధ్యక్షుడు దున్నా అంజయ్య, నాయకులు తూము వెంకటేశ్వరరావు, స్వరాజ్యం, ఎండీ.ఇబ్రహీం, రాంపల్లి వెంకటేశ్వర్లు నివాళులర్పించి, సంతాపం వ్యక్తం చేశారు.

ముమ్మరంగా రహదారి విస్తరణ

- చిలుకూరు నుంచి బేతవోలు వరకు డబుల్ రోడ్డు నిర్మాణం
- బేతవోలు నుంచి జెర్రిపోతులగూడెం వరకు కూడా నిధులు..
- రూ.24కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు


రోడ్డు వెడల్పులో చెట్లను తొలగిస్తున్న జేసీబీ


రోడ్డులో ఏర్పాటు చేసిన నూతన కల్వర్టు

చిలుకూరు : మండల కేంద్రం నుంచి మండలంలోని బేతవోలు వరకు డబుల్ లైన్ రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ రోడ్డు సింగిల్‌లైన్‌గా ఉండడంతో ప్రస్తుతం జరుగుతున్న పనులతో డబుల్ లైన్ రోడ్డుగా మారనుంది. ఎన్నో ఏళ్లుగా ఈ రోడ్డు డబుల్ రోడ్డుగా ప్రతిప్రాదనలకే పరిమితం కావడం తప్పా నిధులు మాత్రం మంజురు కాలేదు. ప్రస్తుతం మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సహకారంతో ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి బేతవోలు రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు నిధులు మంజురు చేయించారు. కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిపై చిలుకూరులోని బేతవోలు క్రాస్‌రోడ్డు నుంచి బేతవోలు వరకు (కనకదుర్గమ్మ గుడి వద్ద గ్రామంలోకి వెళ్లే దారి వరకు) 8కిలోమీటర్లకు ఆర్‌అండ్‌బీ నుంచి రూ.16కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీంతో ఈ పనులను సంబంధిత కాంట్రాక్టర్ నెల రోజులుగా ముమ్మరంగా చేపడుతున్నారు.

8కిలోమీటర్ల పరిధిలో 15కల్వర్టులు..

ప్రస్తుతం బేతవోలుకు వెళ్లే సింగల్ లైన్‌రోడ్డులో 7మీటర్ల వరకు బీటీ ఉంటుంది. డబుల్‌లైన్‌గా మారుతుండడంతో రోడ్డు ఇరుపక్కల మరో 3మీటర్లు విస్తరించనున్నారు. దీంతో మొత్తం 10మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణం జరుగనుంది. అయితే ప్రస్తుతం ఈ రోడ్డు సింగిల్ లైన్ (10ఫీట్లు) వరకు బీటీ ఉంది. ఇరుపక్కల రోడ్డు మొత్తం ఆక్రమణకు గురైంది. ప్రస్తుతం డబుల్‌లైన్ కొరకు భూ సేకరణ చేయాల్సిన పనిలేదు. డబుల్‌లైన్‌కు సరిపడా భూమి ఉండడంతో పనులు సాగుతున్నాయి. ఈ రోడ్డు 8కిలోమీటర్ల పరిధిలో 15కల్వర్టులు నిర్మిస్తున్నారు. కల్వర్టు పనులు కూడా దాదాపు పూర్తికావచ్చాయి.

బేతవోలు నుంచి జెర్రిపోతులగూడెం వరకు మరో రూ.8కోట్లు మంజూరు..

బేతవోలు నుంచి జెర్రిపోతులగూడెం వరకు సైతం మరో 3కిలోమీటర్ల వరకు డబుల్‌లైన్ రోడ్డు నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ నుంచి రూ.8కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులకు సంబంధించి ప్రతిప్రాదనలు పూర్తయ్యి టెండర్ల దశలో ఉంది. టెండర్లు పూర్తిగానే పనులు ప్రారంభించనున్నారు.

తప్పనున్న వాహనదారుల ఇబ్బందులు

ప్రస్తుతం సింగిల్‌రోడ్డుగా ఉండడంతో ఈ రోడ్డుపై ప్రయాణం సాగించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎదురెదురుగా వాహనాలు వస్తే పక్కకు పోవడం చాలా కష్టంగా ఉంది. ఈ రోడ్డు నిత్యం మండల పరిధిలోని బేతవోలు, జెర్రిపోతులగూడెం, ఆచార్యులగూడెం, చెన్నారిగూడెం, పోలేనిగూడెం, కొండాపురం, మాధవగూడెం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ పనుల నిమిత్తం ప్రయాణం చేస్తుంటున్నారు. వ్యాపార పరంగా ఈ ప్రాంతలోని భారీ వాహనాలతో రద్దీగా ఉంటుంది.

9నెలల్లో పనులు పూర్తి చేస్తాం



బేతవోలు డబుల్ లైన్ రోడ్డు నిర్మాణ పనులు ప్రస్తుతం ముమ్మరంగా జరుగుతున్నాయి. రోడ్డు పనుల్లో భాగంగా కల్వర్టులు పూర్తి చేస్తున్నాం. రోడ్డుకు అడ్డుగా ఉన్న కంపచెట్లు తొలగిస్తున్నాం. ఈ రోడ్డుకు రూ.16కోట్ల నిధులు మంజూరయ్యాయి. అలాగే బేతవోలు నుంచి జెర్రిపోతులగూడెం వరకు 3కిలోమీటర్లకు గాను రూ.8కోట్లు మంజూరయ్యాయి. 9నెలలో పనులు పూర్తి చేస్తాం.

– బుడిగె సత్యనారాయణ, ఆర్‌అండ్‌బీ ఏఈ, చిలుకూరు

ఔషధ మొక్కలపై అవగాహన పెంచుకోవాలి


ఔషధ మొక్కలతో హెచ్‌ఎం, విద్యార్థులు

హుజూర్‌నగర్ : విద్యార్థులు ఔషధ మొక్కలపై అవగాహన పెంచుకోవాలని కోర్ గ్రీన్ రెవల్యూషన్ (సీజీఆర్) జిల్లా బాధ్యుడు మామిడి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు ఆయన ఔషధ మొక్కలు అందజేసి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు పెంచాలన్నారు. భావితరాల కోసం ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. ప్రతి పిల్లవాడు మొక్కలపై అవగాహన కలిగి ప్లాస్టిక్ నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో యంగ్ ఎర్త్ లీడర్ సభ్యులు ఔషధ మొక్కల గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అబ్దుల్ లతీఫ్, ఉపాధ్యాయులు జనార్దన్‌రెడ్డి, యంగ్ ఎర్త్ లీడర్స్ సభ్యులు, ఉపాధ్యాయులు జయప్రద, విజయలక్ష్మి, కమలమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే క్షయ వ్యాధిని నివారించొచ్చు


పరీక్షలు చేస్తున్న మండల వైద్యాధికారి కళ్యాణి

హుజూర్‌నగర్ : రోజువారీగా మందుల వాడటంతో పాటు, పలు జాగ్రత్తలు పాటిస్తే క్షయవ్యాధిని నివారించొచ్చని మండల వైద్యాధికారి కళ్యాణి అన్నారు. గురువారం పట్టణంలోని కనకదుర్గగుడి అన్నదాన సత్ర ఆవరణలో క్షయ వాధి నిర్ధారణ పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నా రాత్రి వేళలో జ్వరం రావడం, బరువు తగ్గడం, కళ్లలో రక్తజీరలు ఈ లక్షణాలు కనపడితే క్షయ వ్యాధిగా అనుమానించాలన్నారు. వెంటనే పరీక్షలు చేయించుకుని క్షయ వ్యాధి నిర్ధారణ అయితే ఆ రోగికి ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. రోగికి చికిత్స కాలంలో పోషకాహారం నిమిత్తం ప్రభుత్వం నెలకు రూ.500లు అందిస్తుందని తెలిపారు. ఒక క్షయ రోగి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఏడాదికి ఆ ప్రాంతంలో 12నుంచి 15మందికి వ్యాధిని వ్యాప్తి చేసే అవకాశం ఉందన్నారు. కావున అందరూ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి సోకితే ఆశాకార్యకర్తలకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పద్మ, టీబీ సూపర్‌వైజర్ మమత, ఎల్‌టీ రమేష్, హెల్త్‌అసిస్టెంట్లు ఇందిరాల రామకృష్ణ, విజయశ్రీ, సావిత్రి, ఆశాకార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం ప్రతిఒక్కరి బాధ్యత


నడిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్క నాటుతున్న ఎంపీడీఓ ఇమామ్


గరిడేపల్లి : మొక్క నాటుతున్న ఎంపీడీఓ సరోజ


మఠంపల్లి : వనమహోత్సవంలో పాల్గొన్న ఎంపీడీఓ హరిసింగ్, ఏపీఓ తదితరులు

నడిగూడెం : మొక్కల పెంపకం ప్రతిఒక్కరి బాధ్యతని, మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మొక్కలను బాధ్యతాయుతంగా పెంచి, పర్యావరణాన్ని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి విద్యాసాగర్, ఎంపీఓ విజయకుమారి, పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్, వైద్యసిబ్బంది, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వనమహోత్సవంలో భాగస్వాములు కావాలి

గరిడేపల్లి : ప్రతిఒక్కరూ ఒక మొక్కలు నాటి వనమహోత్సవంలో భాగస్వాములు కావాలని ఎంపీడీఓ సరోజ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన వన మహోత్సవంలో భాగంగా నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద అనే కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఓ సురేష్, ఈసీ సుజాత, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, టీఏ శిరీష, ఫీల్డ్ అసిస్టెంట్ సరితగౌడ్, బిల్‌కలెక్టర్ సతీష్, నర్సిరెడ్డి, నాగరాజు, పద్మ ఉన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా వనమహోత్సవం

మఠంపల్లి : మండలంలోని వివిధ గ్రామాల్లో వనమహోత్సవంలో భాగంగా నాటుదాం ఒకచెట్టు –అమ్మపేరు మీద అనే కార్యక్రమంలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ హరిసింగ్ మండల కేంద్రంలో మొక్కలు నాటిన మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఓ ఉమాదేవి, పంచాయతీ కార్యదర్శులు విజయక్రాంతి, మద్దుల వెంకటేశ్వర్లు, మట్టయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మునగాల : మండల పరిధిలోని ఆయా గ్రామపంచాయతీల్లో అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి 'నాటుదాం ఒకచెట్టు –అమ్మపేరు మీద' మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఎంపీడీఓ కె.రమేష్‌దీన్‌దయాళ్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవీందర్, ఏపీఓ శైలజ, ఈసీ కళ్యాణ్, టీఏ శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శులు, సామాజిక కార్యకర్త సైదులు పాల్గొన్నారు.

మోతె : మండల పరిధిలోని రావిపహాడ్, అప్పన్నగూడెం గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో గురువారం నాటుదాం ఒక్క చెట్టు –అమ్మ పేరుమీద అనే కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ ఆంజనేయులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఓ నగేష్, టీఏలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


హుజూర్‌నగర్ : దోమల మందు పిచికారీ చేయిస్తున్న కమిషనర్ యాకుబ్‌పాషా

హుజూర్‌నగర్ : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరమని మున్సిపల్ కమిషనర్ యాకుబ్‌పాషా అన్నారు. గురువారం స్థానిక మున్సిపాలిటీలోని 18వ, 23వ వార్డులలోని ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు, వివిధ ప్రాంతాలలో వ్యాధులు ప్రబలకుండా దోమల మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, వార్డు అధికారులు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

నడిగూడెం : సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పారిశుద్ధ్యం, వనమహోత్సవంపై అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని, వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి, సంరక్షించాలన్నారు. సమావేశంలో ఎంపీఓ విజయకుమారి, కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మండల స్థాయి పోటీలను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంఈఓ ఛత్రునాయక్

గరిడేపల్లి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14, అండర్–17 బాల బాలికల మండల స్థాయి పోటీలను విజయవంతం చేయాలని ఎంఈఓ ఛత్రునాయక్ కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 31న మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో కబడ్డీ పోటీలు, సెప్టెంబర్ 3న మండలంలోని పోనుగోడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌జీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి హుస్సేన్, ఫిజికల్ డైరెక్టర్లు వ్యాయామ ఉపాధ్యాయులు, రాంప్రసాద్, సైదిరెడ్డి, అంబేద్కర్, ధనమ్మ, ప్రమీల, బాబు, ప్రదీప్‌కుమార్, విజయలక్ష్మి, ఆర్పీలు రామకృష్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాజకీయ శిక్షణ తరగతులు


సమావేశంలో మాట్లాడుతున్న మట్టిపెల్లి సైదులు

మోతె : పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపెల్లి సైదులు అన్నారు. గురువారం మండల పరిధిలోని రాఘవాపురం రోడ్డు గ్రామంలో రెండు రోజులుగా జరుగుతున్న సంఘం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు ముగింపులో ఆయన మాట్లాడారు. రేషన్ షాపుల ద్వారా 14రకాల నిత్యావసర వస్తువులు సబ్సిడీ ధరలకే ఇవ్వాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 12కోట్ల ఉపాధి వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ముల్కలపల్లి రాములు, తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షుడు ముల్కూరి గోపాల్‌రెడ్డి, జానయ్య, పోతయ్య, భాస్కర్, దోసపాటి శ్రీను, స్వరాజ్యం పాల్గొన్నారు.

రైతులందరికీ రుణాలు మాఫీ చేయాలి

- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య


కోదాడ : ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య తదితరులు

కోదాడ : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం రైతులందరికీ రుణాలను మాఫీ చేయాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. గురువారం పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ విషయంలో తెలంగాణ రైతాంగాన్ని మోసం చేసిందని ఆరోపించారు. కేవలం 30శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని, 70 శాతం రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. అనంతరం కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రుణమాఫీని ఎగ్గొట్టేందుకు అర్థంలేని కొర్రీలు

నేరేడుచర్ల : రుణమాఫీని ఎగ్గొట్టేందుకే కాంగ్రెస్ పార్టీ అర్థంపర్థంలేని కొర్రీలను పెట్టి రైతులను ఆందోళనకు గురిచేస్తుందని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒంటెద్దు నర్సింహారెడ్డి అన్నారు. అందరికీ రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ సైదులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు, నాయకులు నాగండ్ల శ్రీధర్, కడియం వెంకట్‌రెడ్డి, లకుమళ్ల జ్యోతి, చెన్నబోయిన సైదులు, లింగయ్య, సుదర్శన్, పిచ్చిరెడ్డి, రాంరెడ్డి, రాములు, నవీన్, మురళి, నాగార్జున, రామస్వామి, రామ్మూర్తి తదితరులున్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

హుజూర్‌నగర్‌రూరల్ : తెలంగాణ వ్యాప్తంగా రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ పిలుపుమేరకు గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద రహదారిపై పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, పార్టీ నాయకులు కేవీఎస్ రావు, పట్టణ ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ అమర్‌గౌడ్, అన్నెం కొండారెడ్డి, అలీపాషా, ఉపేందర్, రాంబాబు, పరుశురాం, నభి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రుణమాఫీ కాలేదంటే.. రైతులపై కేసులా..?

పాలకవీడు : రుణమాఫీ కాలేదన్నందుకు రైతులపై లాఠీచార్జి..కేసులు నమోదు చేస్తారా అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రుణమాఫీపై కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు, రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం ఇన్‌చార్జ్ తహసీల్దార్ కమలాకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ యరడ్ల సత్యనారాయణరెడ్డి, నాయకులు తాటికొండ వెంకట్‌రెడ్డి, రాగిరెడ్డి లక్ష్మారెడ్డి, లక్ష్మీనారాయణ, నాగుల్‌మీరా, సతీష్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని కోరుతూ చింతలపాలెం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకులు గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు సురేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎం.సత్యనారాయణరెడ్డి, మోర్తాల వెంకటరెడ్డి, కె.వెంకట్‌రెడ్డి, పి.శ్రీనివాసరావు, తోట శేషు, మైబల్లి, శ్రీనివాస్, గోవింద్‌రెడ్డి, అంకిరెడ్డి, సత్యానందం రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

మఠంపల్లి : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ పూర్తిగా చేయకపోవడానికి నిరసనగా గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ మంగా రాథోడ్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య, మాజీ జెడ్పీటీసీ బానోతు జగన్‌నాయక్, మఠంపల్లి మాజీ సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి, గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు బీవీ రామారావు, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పి.రామచంద్రయ్య, మాజీ ఉపసర్పంచ్ జాల కిరణ్‌యాదవ్, మాజీ ఎంపీటీసీలు వెంకట్‌రెడ్డి, నాగునాయక్ పాల్గొన్నారు.


మఠంపల్లిలో తహసీల్దార్ మంగారాథోడ్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు


నేరేడుచర్ల : తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

తహసీల్దార్‌కు వినతి

మేళ్లచెరువు : ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీని రైతులకు ఎటువంటి షరతులు లేకుండా అందించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు గురువారం మండల తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సూరిశెట్టి బసవయ్య, శంకర్‌రెడ్డి, బాల వెంకటరెడ్డి, సైదులుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : రైతులందరికీ ఏకకాలంలో రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణానాయక్ అన్నారు. గురువారం పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి, కేఎల్ఎన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వీరంరెడ్డి శంభిరెడ్డి, నాయకులు గుత్తికొండ వెంకటరమణారెడ్డి, కీతా రామారావు, మాశెట్టి శ్రీహరి, బాణోతు వెంకటేశ్వర్లు, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


హుజూర్‌నగర్ రూరల్ : ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


పాలకవీడు : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


గరిడేపల్లి : తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

సంక్షిప్త సమాచారం

బియ్యం అందజేత

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన నిరుపేద, పుట్టుకతో వికలాంగుడైన శివరాత్రి ప్రవీణ్ కుటుంబానికి గురువారం స్థానిక మాజీ వార్డు సభ్యుడు, సామాజిక కార్యకర్త వల్లెపు శ్రీనివాస్ 25కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో గుంజ చినవెంకన్న, గుంజ మురళి, రాజశేఖర్, శివరాత్రి నాగమణి ఉన్నారు.

కుక్కల దాడిలో దూడ మృతి

చిలుకూరు : కుక్కల దాడిలో ఓ దూడ మృతి చెందింది. ఈ ఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొడారు నాగేశ్వరరావు దూడ పొలాల్లో మేత మేస్తుండగా ఒక్కసారిగా కుక్కల మంద దాడి చేసి కరవడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధిత రైతు తెలిపారు.

విద్యార్థులకు క్రీడాదుస్తుల పంపిణీ

గరిడేపల్లి : మండల పరిధిలోని రాయినిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శాంతిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నవనామి కన్‌స్ట్రక్షన్స్ సహకారంతో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చైర్మన్, ఐఆర్ఎస్ రిటైర్డ్ చందా సుధాకర్‌రెడ్డి గురువారం విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగమని, ఉపాధ్యాయులు జానకిరెడ్డి, నర్సారావు, కల్పన, శాంతకుమారి, శశికళ, ప్రదీప్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నేరేడుచర్ల : రవాణా రంగంలో పనిచేసే డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు అన్నారు. గురువారం స్థానిక ఆటోడ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఆటోడ్రైవర్ల పరిస్థితి ఆగమ్యగోచరంగానే ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రతి ఆటోడ్రైవర్‌కు రూ.15వేలు చెల్లించాలని, 55ఏళ్లు నిండిన ఆటోడ్రైవర్లకు పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని, అర్హులైన వారందరికీ ఇండ్లు ఇవ్వాలన్నారు. ఆయన వెంట సీపీఐ నాయకులు కొమ్రాజు వెంకట్, ఆటోడ్రైవర్లు వేణు, అంజి, గోపి, వివేక్ తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

హుజూర్‌నగర్ రూరల్ : సీఎం రిలీఫ్ ఫండ్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్యగౌడ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని గోపాలపురం గ్రామానికి చెందిన పాదిల దుర్గారావుకు మంజూరైన రూ.24,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కాల్వ రంగయ్య, వెంకటేశ్వర్లు, సైదయ్య, వెంకటేశ్వర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

నడిగూడెం : మండల పోలీస్‌స్టేషన్‌ను మునగాల సీఐ రామకృష్ణారెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో కేసులకు సంబంధించిన రిజిస్టర్లను, పరిసరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. శాంతి భద్రతల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.